# రామకృష్ణపరమహంస

భారతీయుల యొక్క భక్తిప్రపత్తులందు కొన్నికొన్ని సమయములలో ఒకవిధమైన హాస్యాస్పదమైన మార్గముకూడా కనిపిస్తుంది. ఐతే, దానియందు కూడా దైవభావం అంతర్భూతమై ఉంటుంది. విద్యార్థి పరీక్షలో పాస్ కావాలంటే దైవాన్ని చింతిస్తాడు. కోర్టు కేసులో విజయం సాధించాలంటే భగవంతుని ప్రార్థిస్తాడు. అంతవరకూ పోనక్కరలేదు. బస్సులో సీటు చిక్కాలంటే కూడా భగవంతుని ప్రార్థిస్తాడు. ఈవిధంగా భారతీయులు చిన్నదాని మొదలుకొని పెద్దదాని వరకు భగవంతునిపై ఆధారపడి ఉంటున్నారు. ఇది దైవపిచ్చి అని చెప్పవచ్చు, లేక మూర్ఖత్వమని చెప్పవచ్చు. ఎవ్వరేమి చెప్పినా ఎవరి పిచ్చి వారిది. ఎవరి విశ్వాసము వారిది. ఎవరి నమ్మకము వారిది. ఎవరి ఆకలి వారిది. దీనిని కాదని చెప్పుటకు ఎవ్వరికీ అధికారము లేదు.

వరుడు చిక్కినంత మాత్రమున కన్యకు వివాహమైనదని విశ్వసించుటకు వీలుకాదు. అక్షరములు తెలిసినంత మాత్రమున లేఖలు వ్రాయటం సాధ్యం కాదు. పదములయొక్క భావములను అర్థము చేసుకొన్నవాడే లేఖలు వ్రాయగలడు. అదేవిధముగనే విషయజ్ఞానము తెలిసినంత మాత్రమున దైవత్వాన్ని గుర్తించుటకు సాధ్యంకాదు. విషయజ్ఞానముతోపాటు ఆధ్యాత్మిక జ్ఞానముకూడా అవసరము. ఆ ఆధ్యాత్మిక జ్ఞానమునకు సత్యాన్వేషణ అవసరము. మానవుడు మొట్టమొదట ఈ విశ్వమందున్న జీవతత్త్వమును చక్కగా అర్థం చేసుకోవాలి. విశ్వరహస్యాన్ని, విశ్వమందు జీవించే ప్రాణుల రహస్యాన్ని గుర్తించిన వ్యక్తులకు మాత్రమే దైవరహస్యాన్ని గుర్తించుటకు సాధ్యమౌతుంది.

**దేవుడిని చూశారా?**

దైవత్వమును అనేకమంది మహనీయులు పరిశీలన సల్పి సాధనల చేత గుర్తిస్తూ వచ్చారు. ఈ కలియుగమందు రామకృష్ణపరమహంస దగ్గరకు కూడా కొంతమంది వచ్చారు. 'స్వామీ! మీరు దైవాన్ని చూసారా?' అని ప్రశ్నించారు. 'ఆ.. చూసాను' అన్నాడు. 'ఏ రూపంలోచూసారు?' అని అడిగారు. 'నిన్ను నేను, నన్ను నీవు చూసినట్లుగా చూసాను' అన్నాడు. 'ఇదెట్లా సాధ్యమౌతుంది?' అని మరల ప్రశ్నించారు. 'తప్పక సాధ్యమౌతుంది. కాని, దైవాన్ని చూడాలనే ఆరాటము మీలో లేదు. ప్రజలారా! ధనకనకవస్తువాహనాదుల నిమిత్తమై, ఆలుబిడ్డల నిమిత్తమై మీరు అనేకవిధములుగా తపిస్తున్నారు. ధనం కావాలని రాత్రింబవలు యేడుస్తున్నారు. కాని, ఈ ఏడుపు దైవం కోసం ఏడ్చారా?

*యాచింతా భువి పుత్ర మిత్ర భరణే వ్యాపార సంభాషణే*
*యాచింతా ధనధాన్య భోగ యశసాం లాభే సదా జాయతే*
*సాచింతా భువి నందనందన పదద్వంద్వారవిందే క్షణే*
*కాచింతా యమరాజభీమ సదన ద్వారే ప్రయాణే ప్రభో!*

పుత్ర మిత్ర భరణ వ్యాపారములపై వ్యామోహంతో మీరు యేవిధంగా పరితపిస్తున్నారో, ధన ధాన్య భోగ యశస్సుల నిమిత్తమై మీరు యేవిధంగా చింతిస్తున్నారో అందులో క్షణకాలమైనా భగవంతుని పాదముల నిమిత్తమై చింతిస్తున్నారా? మీరు పరితపించేది ప్రాకృతమైన చింతలకు, కోరేది దైవదర్శనము! ఇది అసాధ్యము. దైవాన్ని కోరితే దైవము నిమిత్తమై పరితపించాలి. అప్పుడే మీకు దైవం లభ్యమౌతాడు. చెప్పేది ఒకటి, చేసేది మరొకటి. ఇలాంటి పరిస్థితిలో దైవత్వాన్ని మీరు గుర్తించలేరు' అని రామకృష్ణుడు బోధించాడు.

**మన్మనా భవ!**

నిరుపమానమైన కృష్ణార్జునుల మధ్యనున్న స్నేహము రామకృష్ణ పరమహంస నెంతగానో ఆకర్షించెను. భగవద్గీత, భాగవత గ్రంథములనుండి, సాధకుడు నవవిధ భక్తిమార్గములనెడి వివిధ దశలనేవిధముగా అనుభవ

పూర్వకముగా గ్రహించగలడో తెలుసుకొనెను. గోపికలు అనుభవించిన విరహమును తాను అనుభవించి, ఆ మధురభక్తియొక్క అనుభూతిని పొందవలెనని రామకృష్ణుడు నిర్ణయించుకొనెను. రామాయణము చదివి హనుమంతుని దాస్యభక్తికి ముగ్ధుడై ఆ అనుభూతిని పొంద నిశ్చయించెను. భగవద్గీతలో అన్ని శ్లోకములకంటె రామకృష్ణుని హృదయమును ఆకట్టుకొన్న శ్లోకము

మన్మనా భవ మద్భక్తో మద్యాజీమాం నమస్కురు
మామే వైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణః॥

ఈ శ్లోకము శరణాగతిని బోధిస్తుంది. 'నీవు నాతో ఏకమగుము, నాకు భక్తుడవగుము, నా కొరకు త్యాగము చేయుము, నా ముందు మోకరిల్లుము, ఆవిధముగా నాతో ఐక్యత పొందిన నీవు తప్పక నన్ను చేరుదువు'.

ఒకసారి రామకృష్ణుడు కమార్పకూర్ ప్రయాణమై వెళ్ళుచూ, సరిగ్గా శ్మశానం మధ్యనుండి పోవుచుండగా వర్షములో చిక్కుకొనెను. అతని ఆనంద తన్మయ స్థితిలో రాత్రో, పగలో, ఎండో, వానో, ఆలస్యమైందో, ముందే వెళ్ళుచున్నాడో తెలుసుకొనే స్థితిలో లేడు. అంతలో మేలుకొని రామా, కృష్ణా, శివా, కాళీ, హనుమాన్ అంటూ బిగ్గరగా వివిధ నామములతో దైవమును పిలచెను. అంతలో అన్ని నామములూ ఒకే దైవమునకు చెందినవని స్ఫురణకు వచ్చి శరణాగతిని జ్ఞప్తిచేయు ఆ శ్లోకమును పఠించెను.

అప్పుడు రామకృష్ణునికేమి జరిగినదో చెప్పుటలో నాకొక కథ జ్ఞాపకం వస్తుంది. ఒక ఇంటి యజమాని ఐదు రూపాయలనోటు నౌకరు కుఱ్ఱవానికిచ్చి బజారునుండి కూరగాయలు తెమ్మనెను. ఆ పిల్లవాడు ఆ ఐదు రూపాయలనోటును జేబులో వుంచుకుంటూ వంకాయలు ఒక రూపాయి, కేబేజీ ఒక రూపాయి, చేపలు ఒక రూపాయి, కేరెట్లు ఒక రూపాయి అంటూ, అంటూ ఆ ఐదు రూపాయలనోటును ఐదు ఒక రూపాయి నోట్లుగా లెక్కించెను. మొత్తం ఐదు రూపాయల లెక్క కుదిరింది. అంటే, అతడు ఐదుతో ప్రారంభించి మళ్ళీ లెక్క ఐదుతోనే అంత్యం చేశాడు. రామకృష్ణ ఒకే రూపంతో ప్రారంభించాడు, ఒకే దైవంతో ముగించాడు. ఒకే రూపం అనేక రూపాలుగా మారింది. చివరకు అన్ని రూపాలు ఒకే దైవంగా గుర్తించాడు.

దక్షిణేశ్వర్‌లో కూడా ఎన్నో వింతలైన సంఘటనలు జరిగాయి. ఒకసారి ఆలయ కార్యాలయమునకు వెళ్ళి తన నెల జీతమును తీసుకోవలసినదని చెప్పగానే రామకృష్ణ ఎంతో ఆవేదన చెంది, తల్లిని పూజించుటకు కూలి, తీసుకొనుటయా అని వెళ్ళుటకు నిరాకరించెను. మరొక రోజున కాళీ ఆలయమునకు అనుబంధముగానున్న కృష్ణాలయంలో దొంగలు పడి కృష్ణ విగ్రహమునకున్న నగలన్నీ దొంగిలించగా, మధురనాధుడు రామకృష్ణుని కృష్ణాలయమునకు గొనిపోయి కృష్ణ విగ్రహమునుండి దొంగిలించిన నగల వివరములు జ్ఞప్తి చేసుకొని జాబితా తయారు చేయమనెను. అక్కడకు వచ్చి కృష్ణ విగ్రహమునకున్న నగలన్నీ పూర్తిగా దొంగిలించబడుట చూచిన మధురనాధుడు కోపముతో వదలు మరచి,' ఈ పదునాలుగు లోకములను రక్షించువానిగా నిన్ను మేము ఆరాధించుచుండగా నీ శరీరంపైనున్న నగలనే నీవు రక్షించుకోలేవా?' అని కృష్ణునే నిందించెను. రామకృష్ణుడు ఈ దైవదూషణ సహించలేక, ' కృష్ణునికి లక్ష్మియే సతిగా వుండగా ఈ బంగారము, రత్నములు అతనికి మట్టితో సమానము. అసలు బంగారమంటే మరో రూపంలోనున్న మట్టేకదా!' అని అతనిని మందలించెను. దానితో మధురనాధుడు కూడా పశ్చాత్తాపం చెంది, రామకృష్ణుని ద్వారా జ్ఞానోదయము పొందెను.

**మిత్రుడు..భక్తుడు**

ఆధ్యాత్మిక తత్త్వంలో అతి సూక్ష్మమైన రహస్యాలు ఉంటాయి. అవి గుర్తించి వర్తించినప్పుడే రహస్యాలు తెలుస్తాయి. 'నీవు నా మిత్రుడివి నాయనా!' అంటే తలమీద కెక్కుతాడు. 'నీవు నా భక్తుడివి' అంటే మరీ అణిగి మణిగి ఉంటాడు. మరీ భయపడుతూ ఉంటాడు. కనుక, పూర్తి భయమూ ఉండకూడదు, పూర్తి స్వాతంత్ర్యమూ ఉండకూడదు. కనుక, 'నీవు నా మిత్రుడవు, నా భక్తుడవు' అన్నాడు. 'నా మిత్రుడ'ని అంటే స్వతంత్రంగా ఉండు అని. 'నా భక్తుడ'ని అంటే అణకువగా ఉండు అని అర్థం. రెండూ తగిన మోతాదుల్లో ఉండాలి.

ప్రేమ తక్కువగా ఉంటే ఎక్కించాలి. ఎక్కువగా ఉంటే తగ్గించాలి. ఒక చక్కని ఉదాహరణ. రామకృష్ణ పరమహంస జీవిత కాలంలో జరిగింది. ఆ కాలంలోనైనా, ఈ కాలంలోనైనా మంచిని విమర్శించేవాళ్లు, ద్వేషించే వారూ ఎప్పుడూ ఉంటూనే ఉంటారు. ప్రతి దానికీ విమర్శ ఉంటుంది.

రామకృష్ణ పరమహంస ఆశ్రమానికి శిష్యులు యేమైనా వస్తువులు తీసుకొని రావాలంటే గంగానది అవతలకి పడవలో వెళ్లి రావలసి వచ్చేది. ఆశ్రమంలో యువకులైన సాధకులు కొందరుండేవారు. వారికి ఒక్కొక్క రోజు ఒక్కొక్కరికి ఆ వస్తువులు తెచ్చే కార్యక్రమం నియమించి పెట్టారు గురువుగారు. ఇందులో బ్రహ్మానందము అనేవాడు చాలా మెత్తనివాడు. వివేకానందుడు చాలా చురుకైనవాడు.

ఒకరోజు బ్రహ్మానందం వంతు వచ్చింది. అతను బయలుదేరాడు. గంగ అవతలకి వెళ్ళి కూరగాయలు మొదలైనవి తేవటానికి. కాషాయ వస్త్రాన్ని చూసేటప్పటికి పడవలో ఉన్నవారందరికీ చాలా కోపం వచ్చింది. పడవలో వాళ్ళంతా రామకృష్ణ పరమహంసను దూషించటం ప్రారంభించారు. ' ఆయన వీళ్ల జీవితాల్ని నాశనం చేస్తున్నాడు. ఆయన ఒక పిచ్చి సన్నాసి' అని యీవిధంగా అనటం సాగించారు. ఈ బ్రహ్మానందం అవన్నీ వింటూ కన్నీరు కార్చాడు. కాని, యేమీ మాట్లాడలేకపోయాడు. సరే, కొనవలసినవన్నీ కొనుక్కొని భయపడుతూ అదే పడవలో తిరిగి మరలా వాళ్ళ చేత నిందలు పడుతూ ఆశ్రమానికి వచ్చి చేరుకున్నాడు. అప్పుడు రామకృష్ణుడు శిష్యులందరినీ కూర్చోబెట్టుకొని యేదో సంభాషణ చేస్తున్నాడు. బ్రహ్మానందం వస్తువులన్నీ లోపల పెట్టి స్నానం చేసి వచ్చి కూర్చున్నాడు. రామకృష్ణుడు బ్రహ్మానందంతో, 'మార్కెట్టు పని బాగా జరిగిందా? నీవు వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు ఏమి జరిగిందో పూస గుచ్చినట్లు చెప్పు' అన్నాడు. అప్పుడు బ్రహ్మానందం గట్టిగా ఏడ్చాడు. ఏమని చెప్పాలి? గురునిందను భరించలేకపోయానని చెప్పాడు. అప్పుడు రామకృష్ణుడు కోపంతో, 'ఛీ! ఛీ! గురునిందను ఎలా భరించావు? నీలాంటివాడు నా ఆశ్రమంలో ఉండటానికి వీలు లేదు. వెళ్ళు' అన్నాడు. బ్రహ్మానందం గురువుగారి కాళ్ళమీద పడ్డాడు. ఇదంతా విన్నాడు, చూసాడు ప్రక్కనే ఉన్న నరేంద్రుడు.

రెండవరోజు నరేంద్రుని వంతు వచ్చింది. అతడు బయలుదేరాడు. పడవలో వాళ్ళు చూసారు. మరల కాషాయం వచ్చిందని దూషణ ప్రారంభించారు. నరేంద్రునికి గురువుగారి మాటలు బాగా గుర్తున్నాయి. ఇంతలో ఒక షాహుకారు ప్రారంభించాడు. 'ఈ పిచ్చి గురువు ఈ యువకుల్ని పాడుచేస్తున్నాడు. మీకు బుద్ధి లేదా? అతనికి బుద్ధి లేదా?' అని. నరేంద్రుడు లేచి రెండు దెబ్బలు కొట్టాడు. నరేంద్రుడు మంచి బలవంతుడు. వాడిని పట్టుకొని, 'నోరు మూస్తావా గంగలో తోయమంటావా? నీకు యిష్టం లేకపోతే నోరు మూసుకొని కూర్చో. మా యిష్టాన్ని దూషించే అధికారం నీకెక్కడుంది? నా యిష్టం నాది, నీ యిష్టం నీది' అన్నాడు. ఈ షాహుకారుని గంగలో వేస్తాడేమోనని అందరూ భయపడ్డారు. ఈ పనితో అందరూ నోరుమూసుకొని కూర్చున్నారు. మౌనంగా ప్రయాణం సాగింది. నరేంద్రుడు మార్కెట్టుకు వెళ్ళి కావలసినవి కొనుక్కొని తిరిగి వచ్చి పడవలో కూర్చున్నాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. ఆశ్రమానికి చేరాడు. స్నానం చేసి గురువు దగ్గర సత్సంగంలో పాల్గొన్నాడు.

గురువు అడిగారు, ' నరేంద్రా! నీ ప్రయాణం బాగా జరిగిందా? మార్కెట్ పని పూర్తయిందా? నీవు కూడా వివరంగా చెప్పు.' 'పడవలో వాడు గురుదూషణ చేస్తే రెండు కొట్టి గంగలో పడవేస్తానన్నాను. అంతటితో యింక ఎవ్వరూ మాట్లాడలేదు' అని వివరంగా చెప్పాడు.

రామకృష్ణుడు అన్నాడు,' ఛీ! ఛీ! కట్టేది కాషాయం, ఈవిధమైన క్రోధం. ఇంత ద్వేషం. ఇలా క్రూరత్వానికి పాల్పడినావా? నీవు నా ఆశ్రమంలో ఉండదగనివాడవు. పో. ఎవరు యేమనుకుంటే మనకేమి? ఆ దూషణ భూషణ తిరస్కారాలు మనకు అంటవు'.

వివేకానందుడు అన్నాడు,' నిన్న బ్రహ్మానందం చెప్పింది విన్నారు కదా! ఆ మాటలకి మీకు కోపం వచ్చింది. దాన్నిబట్టి నేను యిలా చేశాను. గురుదూషణ వినకూడదు అంటున్నారు. వారిని హింసించకూడదు అంటున్నారు. ఇవి పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. మేము ఏమి ఆచరించాలి'. అప్పుడు రామకృష్ణుడు చక్కని ఉదాహరణము చెప్పాడు. 'కారుకి నాలుగు టైర్లు ఉంటాయి. ముందు టైర్లకి యింత గాలి ఉండాలి, వెనుక టైర్లకి యింత గాలి

ఉండాలి అనే నియమం ఉంటుంది. ఒక చక్రంలో ఎక్కువ గాలి ఉంటే తగ్గించాలి. ఒక చక్రంలో తక్కువ గాలి ఉంటే ఎక్కువ నింపాలి. అప్పుడే ప్రయాణం చేయటానికి వీలవుతుంది. నరేంద్రునికి ఎక్కువగా ఉంది కాబట్టి ఆ గాలి కొంచెం తీయాలి. బ్రహ్మానందానికి ఏమీ లేదు కాబట్టి వానికి కొంచెం ఎక్కించాలి'. కనుక, వ్యక్తినిబట్టి పెద్దలు బోధలు చేస్తూ ఉంటారు.

**చెదరే మనసుకు చెంపదెబ్బ**

భగవంతుని దృష్టి ఎవరిపై ఉంటుంది, ఎక్కడ ఉంటుంది, అనే సందేహము రావచ్చును. బల్బు ఉన్నది. ఈ బల్బు వెలుగు ఎక్కడ పడుతున్నాది? అన్నివైపులా పడుతున్నాది. అదేరీతిగా భగవంతుడు వెలుగువంటివాడు. ఎవరిని చూస్తున్నాడు? అందరినీ చూస్తున్నాడు. ఈ సభలో నిద్రపోయేవారిని చూస్తున్నాడు. ఇంకొకరు వినకుండా యేదో చింత చేస్తున్నవారిని చూస్తున్నాడు. చింతలు వేరువేరుగా ఉండవచ్చును. కాని, అందరికీ వెలుగే ఆధారము. ఒకానొకసమయంలో రామకృష్ణపరమహంస సాయంకాలం వేళలో చక్కని బోధ చేస్తున్నాడు. ఆయొక్క గుంపులో రాణిరాసమణి వచ్చి కూర్చుంది. ఆ రాణిరాసమణి కట్టించిన ఆలయమునకు ఈ రామకృష్ణపరమహంస పూజారి. చక్కగా భగవద్విషయాలను చెబుతున్నాడు. కాని, రాణిరాసమణి విన్నట్లుగానే తలవూపుతోంది. కాని, ఈ విషయం రామకృష్ణకు బాగా తెలుసు. లేచాడు కుర్చీనుండి. ఆ కూర్చున్న రాణిరాసమణి చెంపమీద ఒక్కతూరి కొట్టాడు. అందరికీ ఆశ్చర్యం వేసింది. 'ఏమిటీ పిచ్చివాడు, ఆమె దగ్గర ఉద్యోగంలో వున్నాడు. ఆమెయొక్క దేవాలయంలోనే సేవ చేస్తున్నాడు. కాని, ఆమెను ప్రజల మధ్యలో యింత అవమాన పరిచాడు' అని అనేకమంది అనేకరీతులుగా విచారించారు. 'ఈ సభలో వచ్చినవారంతా దేనికోసం వచ్చారు? చెప్పే విషయాలు శ్రద్ధగా వినాలి. విన్న విషయాలను ఆచరణలో పెట్టాలి. కాని, నీవు వచ్చి ఈ సభలో కూర్చొని రేపటి కోర్టు విషయమంతా నీవు విచారణ చేసుకుంటున్నావా? నీవు అలా కోర్టు విషయాలు విచారణ చేసుకోవాలంటే యింట్లో కూర్చొని విచారణ చేసుకోవాలి. ఇక్కడికెందుకు రావాలి?' అన్నాడు. ఈ వాక్యము ఎంతో ఆదర్శవంతమైనది. అనేకమంది సభలో పాల్గొంటూ ఉంటారు. ఏమి చెప్పారో యేమిటో ఎవరికీ తెలియదు. ఏవేవో విచారణ చేసుకుంటూ వుంటారు. కాబట్టి అలా యోచన చేసేవారు సభలో పాల్గొనరాదు. సమావేశములో పాల్గొంటే తు.చ. తప్పకుండా ఆచరించేందుకు ప్రయత్నించాలి. ఈ సత్యాన్ని ఆనాడు రామకృష్ణుడు చక్కగా ఆచరణరీతిలో ప్రచారం చేశాడు.

రామకృష్ణునికి కాళీమాతపై సంపూర్ణ శరణాగతి భావముండేది. అతడు కేన్సర్ వ్యాధితో బాధ పడుతున్నప్పుడు శిష్యులందరూ తన బాధ నివారణకై కాళీమాతను ప్రార్థించమనిరి. మాతతో మాట్లాడగల సన్నిహిత భక్తుడైనప్పటికీ తన యింత చిన్న కోరికను కూడా కోరక పోవుట చూచి వివేకానందుడు నిరాశ చెందెను. 'ఈవిధముగా నేను బాధపడుట అమ్మ సంకల్పమే అయితే, నేను ఈ బాధను నివారించమని ఎలా అడగను!' అన్నాడు రామకృష్ణుడు. అతడు తన భావములను నిరంతరమూ 'మన్మనా భవ మద్భక్తో....' అనే గీతా శ్లోకము ననుసరించే మసలుకొనేవాడు.

**వాసుదేవస్సర్వమిదం**

అతని శిష్యులు మాత్రం మొండిగా పట్టుపట్టారు. వాళ్ళ పోరు పడలేక రామకృష్ణుడు కేన్సరుతో వాచిన గొంతుక ద్వారా యించుక ఆహారము తీసుకొనగలిగేటట్లు సహాయము చేయమని మాతను ప్రార్థించాడు. తర్వాత రామకృష్ణుడు శిష్యులతో తాను మాతను ప్రార్థించగా మాత తనయొక్క అజ్ఞానమునకు మందలిస్తూ, 'ఇన్ని కోట్ల గొంతుకలతో భుజిస్తున్న నీకు ఒక్క గొంతుకతో ఆహారము తీసుకోలేకపోతే వచ్చిన నష్టమేమిటి!' అంది అని చెప్పెను. 'వాసుదేవస్సర్వమిదం' అనే సత్యమును ఈ సంఘటన ద్వారా శిష్యులు తెలిసికొనిరి.

ఒకానొక సమయమున రామకృష్ణపరమహంస ధ్యాననిగ్నుడై వున్నప్పుడు ఆయన ఎదుట దేవి ప్రత్యక్షమై, తేజోవంతుడైన ఒక అబ్బాయిని చూపించి, 'ఇతడు నీ కుమారుడు' అని పలికినది. రామకృష్ణుడు దిగ్భ్రాంతితో, స్త్రీలు అందరినీ మాతృసమానముగా భావించుచున్న నాకిదేమి విపరీతమని చాలా బాధపడినాడు. ధ్యానావస్థలోనే కంటిధారలు కారినవి. 'తల్లీ! ఏమిటీ ఘోరము. నాయందు నీవేకలవు, నీయందూ నేనే కలను. ఈశావాస్యమిదం సర్వం, ఈశ్వరస్సర్వ

భూతానాం అని తెలిసికొన్న నాకు భార్యాపుత్రులెవరు, బంధుమిత్రులెవరు?' అని పరితపించాడు. అప్పుడు దేవి మృదుమందహాస వదనురాలై కామపుత్రుడు కాదు, ప్రేమపుత్రుడు అని సమాధానపరచినది. కొన్ని సంవత్సరముల తర్వాత, రాఖాల్ అనే ఒక అబ్బాయిని మనమోహన్ అనేవాడు దక్షిణేశ్వరమునకు తీసుకొనివచ్చినప్పుడు పరమహంసునికి ధ్యానదృశ్యము జ్ఞాపకము వచ్చినది. ఆ పిల్లవానిని కౌగలించుకొని, ఆనందబాష్పములతో స్వాగతించి తనదగ్గరనే నివాసమేర్పరిచినాడు. వాడే రామకృష్ణుని ప్రేమపుత్రుడు, బ్రహ్మానందుడు. రాకృష్ణమఠముయొక్క మొదటి అధ్యక్షుడు. రామకృష్ణుడు తన అంత్యసమయమునకు ఎనిమిది నిముషముల ముందుగ బ్రహ్మానందుని తన సమీపమునకు పిలచి, ఆయన చెవిలో తన ధ్యానానుభవమును చెప్పినాడు. నాయొక్క సమస్త సొత్తుకు నా పుత్రునికే అధికారమన్నాడు.